# యువ వెలుగు

PRGI: TGTEL/26/A6429

E- Paper, www.yuvavelugu.com  తెలుగు దిన పత్రిక

RNI No.52722/90  సంపుటి : 01  సంచిక : 01  హైదరాబాద్, 30 సెప్టెంబర్ 2026 బుధవారం  E-mail : uvavelugu@gmail.com  పేజీలు : 4  వెల : రూ. 5.00


## స్టాక్ మార్కెట్‌కు వరుసగా రెండో రోజు నష్టాలు
## సెన్సెక్స్ 242 పాయింట్లు డౌన్



- 64 పాయింట్లు తగ్గిన నిఫ్టీ
- వరుసగా రెండో సెషన్‌లో మార్కెట్‌కు నష్టాలు
- మార్కెట్ సెంటిమెంట్‌పై చమురు ధరల ప్రభావం
- మిడ్, స్మాల్‌క్యాప్ షేర్లలో అమ్మకాలు
- ఫార్మా షేర్లతో మార్కెట్‌కు కొంత ఊరట

**న్యూఢిల్లీ, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** భారత స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో సెషన్‌లోనూ నష్టాలతో ముగిశాయి. పెరిగిన ముడి చమురు ⏭ తరువాయి 2లో..

## డేటింగ్ యాప్ మోసం
### జూబ్లీహిల్స్ పబ్‌లో యువకుడికి రూ. 29,000 బిల్లు!



- వార్త 2 లో..

# తుమ్మిడిహట్టి నిర్మాణానికి అనుమతులు ఇప్పించండి

- పీఆర్ఎల్ఐఎస్, సీతారామ ప్రాజెక్టులకు అనుమతివ్వండి
- పర్యావరణ అనుమతులు వెంటనే మంజూరు చేయండి
- కృష్ణా జలాల వినియోగంపై టెలీమెట్రీలు ఏర్పాటు చేయాలి
- మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించాం
- జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు సిఎం రేవంత్ రెడ్డి వినతి
- మంత్రి సీఆర్ పాటిల్‌తో సిఎం రేవంత్ రెడ్డి సమావేశం



**న్యూఢిల్లీ, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** తుమ్మిడిహట్టి బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి త్వరగా అనుమతులు ఇప్పించాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి మహారాష్ట్ర కోరిన సమాచారాన్ని ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఢిల్లీలో జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణా, గోదావరి బేసిన్లలో తెలంగాణ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపై కేంద్ర మంత్రితో వారు చర్చించారు. తుమ్మిడిహట్టి బ్యారేజీని ఎఫ్ఆర్ఎల్ ౦152 మీటర్ల స్థాయిలో నిర్మించేందుకు తెలంగాణ, మహారాష్ట్ర మధ్య త్వరగా అంగీకారం కుదిరేలా చూడాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఆ స్థాయిలో బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ఆధారంగా నీటిని ఎల్లంపల్లికి తరలించేందుకు వీలుంటుందని తెలిపారు. దాంతో నీటి తరలింపునకు అవసరమయ్యే విద్యుత్ వినియోగం, విద్యుత్ వ్యయం తగ్గుతుందని వివరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్), సీతారామ సాగర్ బహుళార్ధక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), గౌరవెల్లి రిజర్వాయర్లకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పర్యావరణ అనుమతులకు మార్గదర్శకాలను జారీ చేస్తామని కేంద్రం ప్రకటించిన నేపథ్యంలో ఆయా ప్రాజెక్టులకు వెంటనే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని సీఎం కోరారు. అనుమతుల జాప్యంతో ప్రాజెక్టుల నిర్మాణ వ్యయం పెరుగుతోందని సీఎం తెలిపారు. సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) వద్ద పెండింగ్‌లో ఉన్న అనుమతులను త్వరగా మంజూరు చేయాలని సీఎం విజ్ఞప్తి మిగతా 2లో

# పాలనలో కొత్త ఒరవడి
# నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

- టెక్నాలజీతో పాలనా విధానాలు మరింత సరళీకృతం
- పౌరసేవల్లో నాణ్యతే సామర్థ్యాల పెరుగుదలకు గీటురాయి
- మిషన్ కర్మయోగి దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ తొలి సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఏపీకి మొదటి స్థానం
- తదుపరి స్థానాల్లో కర్ణాటక, ఒడిశా
- సీఎం చేతుల మీదుగా అవార్డులు అందుకున్న మూడు రాష్ట్రాల అధికారులు



**విజయవాడ, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** దేశాభివృద్ధిలో వచ్చే 20 ఏళ్లు అత్యంత కీలకమని, ఈ కాలంలో ప్రభుత్వ వ్యవస్థలు, సంస్థల్లో విప్లవాత్మక మార్పులు రావాల్సిన అవసరం ఉందని ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు వేగంగా మారుతున్నాయని, వాటికి అనుగుణంగా ప్రభుత్వ పాలనా విధానాలు, ప్రక్రియలు, ఉద్యోగుల నైపుణ్యాలు కూడా నిరంతరం మెరుగుపడాలని పేర్కొన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు పాత విధానాలు, అనవసర నిబంధనలను సరళీకరించి పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాధన శృంఖల-2026 మిషన్ కర్మయోగి ప్రాంతీయ సదస్సును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఒడిశా, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు, శిక్షణ సంస్థల ప్రతినిధులు ఈ రెండు రోజుల సదస్సుకు హాజరయ్యారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాల పెంపు, పరిపాలనా నైపుణ్యాల మెరుగుదల, ప్రభుత్వ శిక్షణ సంస్థల సామర్థ్య నిర్మాణంపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలు కేవలం ఉద్యోగులకు కోర్సులు నిర్వహించే కేంద్రాలుగా ఉండకూడదని సీఎం అన్నారు. సవాళ్లను పరిష్కరించడంలో ఉద్యోగుల నైపుణ్యాలను పెంచే సంస్థలుగా అవి మారాలని సూచించారు. ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడమే కాకుండా, ఆ శిక్షణ వల్ల పాలనలో ఎలాంటి మార్పు వచ్చిందో, ప్రజలకు అందే సేవల్లో ఎలాంటి మెరుగుదల కనిపించిందో కూడా కొలవాల్సిన అవసరం ఉందన్నారు. కోర్సులు పూర్తి చేసి సర్టిఫికెట్లు పొందడం మాత్రమే కెపాసిటీ బిల్డింగ్ కాదని.. నేర్చుకున్న అంశాలను ఉద్యోగులు తమ విధుల్లో ఎంతవరకు ⏭ తరువాయి 2లో..

# దేవుడి పేరుతో రాజకీయాలు వద్దు

- దేవుడి పేరుతో రాజకీయాలు చేయడం సరికాదన్న పొన్నం
- ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవించడం మన సంస్కృతి అని వ్యాఖ్య
- ఆలయాల అభివృద్ధి ప్రభుత్వ బాధ్యత అని స్పష్టీకరణ



**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడి పేరును వాడుకోవడం సరికాదని, అది ఎవరికీ మేలు చేయదని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రతి వ్యక్తికి తమ తమ దేవతలపై విశ్వాసం ఉంటుందని, ఇతరుల నమ్మకాలను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని ఆయన పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారని పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్రంలోని దేవాలయాలను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు. వేములవాడ రాజన్న, భద్రాద్రి రాముడు, కొండగట్టు ఆంజనేయ స్వామి సహా అన్ని ఆలయాల పట్ల తనకు గౌరవం, విశ్వాసం ఉన్నాయని చెప్పారు. వ్యక్తిగతంగా తనకు శివుడు ఆరాధ్య దైవమని ఆయన పేర్కొన్నారు.

# బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్



- ఇది మరో తుగ్లక్ నిర్ణయమంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శ
- చౌకగా లభించే సింగరేణి బొగ్గును కాదని విదేశీ బొగ్గు కొంటున్నారని ఆరోపణ
- టన్నుకు రూ. 3,800 బదులు రూ.9,000 చెల్లిస్తున్నారని ఆగ్రహం
- ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయమంటూ ఎక్స్‌లో కేటీఆర్ ప్రశ్న

**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం బొగ్గు కొనుగోలుపై కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వపు మరో 'తుగ్లక్ నిర్ణయం'గా ఆయన అభివర్ణించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' ద్వారా ఆయన తన నిరసనను వ్యక్తం చేశారు. చౌకగా లభించే సింగరేణి బొగ్గును పక్కనపెట్టి, భారీ ధర వెచ్చించి విదేశీ బొగ్గును దిగుమతి చేసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంపై కేటీఆర్ మండిపడ్డారు. సింగరేణి బొగ్గ టన్నుకు సుమారు రూ.3,800కే అందుబాటులో ఉండగా, విదేశాల నుంచి దాదాపు రూ.9,000 వెచ్చించి దిగుమతి చేసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవడాన్ని ఆయన ఆక్షేపించారు.

ఈ నిర్ణయం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయని, ఈ అదనపు భారాన్ని రాష్ట్ర ప్రజలపై ఎందుకు మోపుతున్నారని ఆయన ప్రశ్నించారు. దక్షిణ భారతదేశంలోనే అతిపెద్ద బొగ్గు నిల్వలు తెలంగాణలో ఉన్నాయనే విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. గతంలో సింగరేణి సంస్థ ఆంధ్రప్రదేశ్, ⏭ తరువాయి 2లో..

# అదుపుతప్పి మాట్లాడితే మహిళలతో కొట్టిస్తా: కొండా సురేఖ

- నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో కొట్టిస్తానన్న కొండా సురేఖ
- వరంగల్‌లో ప్రతిపక్ష నేతలకు, పార్టీలోని కొందరికి హెచ్చరిక
- ప్రతిపక్ష నేతలు గాల్లో కత్తులు తిప్పుతున్నారంటూ వ్యాఖ్య
- కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పక్కనపెట్టాలని నేతలకు సూచన

2 లో



## కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం

- కేసీఆర్‌పై పార్టీ వైఫల్యాలు నెడుతున్నారంటూ విమర్శలు
- కేటీఆర్ తీరు పార్టీ వ్యతిరేకం కాదా అంటూ నిలదీత
- ఫామ్‌హౌస్‌లు, క్విడ్ ప్రో కోపై ఆరోపణలు
- రైతు, మహిళ పట్ల వ్యాఖ్యలపై కేటీఆర్‌పై విమర్శలు

2 లో





## బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి వివాదం హైకోర్టు కీలక ఆదేశాలు

- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు అసభ్యంగా ప్రవర్తించారనడానికి ఆధారాల్లేవన్న హైకోర్టు
- బాధ్యులైన పోలీసులను గుర్తించాలని డీజీపీకి ఆదేశం
- పోలీసులపై చర్యలకు నివేదిక సిద్ధం చేయాలని సూచన
- నివేదికను స్పీకర్ ముందు ఉంచాలని ఆదేశం
- స్పీకర్ ఆదేశాలైతే చర్యలు ఆయన పరిధిలోనే ఉంటాయన్న కోర్టు

2

# పోలీసులతో పాలన సాగిస్తున్నారు: బొత్స

- ఏపీలో కూటమి ప్రభుత్వం నిరంకుశ పాలన సాగిస్తోందన్న బొత్స
- పోలీసులను అడ్డం పెట్టుకుని ఉద్యోగుల నిరసనను అణచివేస్తోందని ఆరోపణ
- వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని డిమాండ్



**అమరావతి, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని నిరంకుశ పాలన సాగిస్తోందని వైసీపీ సీనియర్ నేత, శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్య నారాయణ ఆరోపించారు. తమ డిమాండ్ల కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సచివాలయ ఉద్యోగుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు సరికాదని ఆయన ఖండించారు. ప్రజాస్వామ్యంలో తమ అభిప్రాయాలను, నిరసనను వ్యక్తం చేసే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుందని స్పష్టం చేశారు. సచివాలయ ఉద్యోగుల ఆందోళనను ⏭ తరువాయి 2లో..

# భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం

- పట్టాలెక్కిన తొలి ఎల్ఎన్‌జీ రైలు..
- దీని ప్రత్యేకత ఏంటంటే?



**న్యూఢిల్లీ, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** భారతీయ రైల్వే చరిత్రలో మరో కీలక ఘట్టం నమోదైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)తో నడిచే రైలును ప్రవేశపెట్టారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న సబర్మతి రైల్వే స్టేషన్‌లో ఈ నెల 27న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ రైలును జెండా ఊపి ప్రారంభించారు. సబర్మతి నుంచి మెహసానా మధ్య ఈ రైలు తన తొలి ప్రయాణాన్ని పూర్తిచేసుకుంది. ఈ రైలు ఎనిమిది కోచ్‌లు కలిగిన డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (డీఈఎంయూ) ర్యాక్. దీని ప్రత్యేకత డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌తో పనిచేయడం. ఈ రైలుకు ఉన్న రెండు 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల డ్రైవింగ్ పవర్ కార్లను (ఇంజిన్లు) డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీతో కూడా నడిచేలా మార్పులు చేశారు. ఇంధన లభ్యత, అవసరాన్ని బట్టి డీజిల్ లేదా ఎల్ఎన్‌జీల మధ్య ఇంజిన్‌ను మార్చుకునే సౌలభ్యం దీనిలో ఉంది. ప్రతి పవర్ కారులో 2,200 లీటర్ల సామర్థ్యమున్న ప్రత్యేక ⏭ తరువాయి 2లో..

# ధరణి పేరిట రికార్డులు తారుమారు

- మా భూములను సర్వేనెంబర్ 325లో కలిపారు
- సర్వేచేసి మా భూములు మాకు ఇప్పించండి
- మంత్రి పొంగులేటికి వెంకటాపూర్ గ్రామస్థుల వేడుకోలు
- క్షేత్రస్థాయి సర్వేతో వాస్తవాలు తేలుస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి
- భూ సమస్యపై సమగ్ర విచారణకు మంత్రి హామీ



**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** సిద్దిపేట జిల్లా గజ్వేలు నియోజకవర్గంలోని మార్కూక్ మండలం శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. ధరణి పోర్టల్‌లో రికార్డుల మార్పులతో తమ తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని రైతులు మంత్రికి విన్నవించిన నేపథ్యంలో, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయి విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసి అర్హులైన వారికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన తుమ్మల సత్యనారాయణ, శేరి పోషయ్య, శేరి శ్రీకాంత్, పుట్ట విఠల్, పుట్ట దయానంద్, బచ్చలి జహంగీర్ తదితరులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శివారు వెంకటాపూర్ గ్రామంలోని సర్వే నంబర్లు 38, 41, 47, 85, 88, 100లోని దాదాపు 134 ఎకరాల వ్యవసాయ భూముల్లో తమ తాత ముత్తాతల కాలం నుంచి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. అయితే ధరణి పోర్టల్ వచ్చిన తర్వాత రికార్డులను తారుమారు చేయడం ద్వారా తమ భూములపై హక్కులు లేకుండా చేశారని, తమ పొలాలు తమకు కాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ధరణి అమలుకు ముందు తమ వద్ద ఉన్న పాస్‌బుక్కులు, గ్రామ నక్షా పతాలను కూడా రైతులు మంత్రికి చూపించారు. ఆనాటి ప్రభుత్వంలో అధికారులు కొత్త పాస్‌బుక్కులు ఇస్తామని చెప్పి తమ వద్ద ఉన్న పాత పాస్‌బుక్కులను తీసుకున్నారని, అయితే కొత్త పాస్‌బుక్కులు ఇవ్వకుండా తమను మోసం చేశారని వారు మంత్రికి వివరించారు. ఆనాటి ప్రభుత్వ హయాంలో ఓవర్ మ్యాపింగ్ పేరుతో శివారు వెంకటాపూర్ గ్రామ వ్యవసాయ భూములను ఎర్రవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 325లో కలిపి నక్షా రూపొందించారని, దీనివల్ల తమకు తీవ్ర అన్యాయం జరిగిందని రైతులు ఆరోపించారు. ప్రస్తుతం ఎర్రవెల్లిలోని సర్వే నంబర్ 325లో ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వే తరహాలోనే శివారు వెంకటాపూర్ గ్రామంలోనూ సమగ్ర సర్వే నిర్వహించి, గ్రామ సరిహద్దులను స్పష్టంగా గుర్తించి, రికార్డులు--పాత పాస్‌బుక్కులు--గ్రామ నక్షా--క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించి ఎవరికి చెందిన భూమి వారికి అప్పగించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన శివారు వెంకటాపూర్ గ్రామ రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందలేదని మంత్రికి వివరించారు. అదేవిధంగా దేవాసుకుంట, ముత్తిలింగం కుంటలను కూడా పాండురంగా రిజర్వాయర్‌లో విలీనం చేశారని తెలిపారు. రిజర్వాయర్ నిర్మాణం, భూముల మ్యాపింగ్, రికార్డుల మార్పుల కారణంగా తమ గ్రామ రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను విన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఈ వ్యవహారంపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి వాస్తవాలను నిర్ధారిస్తామని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వం. ఎవరి భూమి వారికి దక్కేలా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటాం" అని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రటరీ డిఎస్ లోకేష్ కుమార్, సర్వే ఢ ల్యాండ్ సెటిల్‌మెంట్స్ కమీషనర్ రాజీవ్ గాంధీ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

## హామీల వైఫల్యంపై సెప్టెంబర్ మొదటి వారంలో బీఆర్ఎస్ నిరసనలు

**తుంగతుర్తి, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ప్రెస్ మీట్. 100రోజులలో 6 ఆరు అబద్ధపు హామీలూయి నెరవేర్చ లేని చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సెప్టెంబర్ 2కి 3 సంవసరాలు. పూర్తి చేసుకున్న కెసిఆర్ కేటీఆర్ గారి ఆదేశానుసారం సెప్టెంబర్ మొదటి వారం లో నిరసన కార్యక్రమాలు హామీల అమలు విఫలంపై అమలు చేయని 6 గ్యారంటీల హామీలపై వారం రోజుల పాట్ నిరసన ర్యాలీలు. నాలుగో తారీఖు వృద్ధులకు వికలాంగులకు అమలు చేయని హామీలపై పెద్ద సంఖ్యలో తిరుమలగిరిలో నిరసన కార్యక్రమం. 7వ తరికు మండల కేంద్రంలో ఏర్పరిచిన ప్రజావాణిలో నిరసన వినతి పత్రాలు ఇవ్వాలని కోరారు. 100 రోజులు అన్నాడు,1000రోజులు అవుతున్న అమలు చేయని చేతగాని ప్రభుత్వం. రేవంత్ రెడ్డి అన్నదమ్ములు దోచుకుంటున్నారని సెటిల్మెంట్లు దండాలు పాల్పడుతున్నారని అన్నారు. కుర్చీని ఎక్కడ లాక్కుంటారు అని కుర్చీకి మిగతా నాయకులు ఎక్కడ గుంజుతారో అని కొండ సురేఖ పంచాయతీ ముందటవేసుకున్నారు. అందులో భాగంగానే ఖూకి వెళ్లకుండా ఆగాడని అన్నారు. ఇద్దరు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్న నాయకుడు ఉంగులేటి శ్రీనివాస్ రెడ్డి,రేవంత్ రెడ్డి. కోటి పదహారు లక్షలు భూములను 22ఏ లో పెట్టి ప్రజలను నానా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు.

# డేటింగ్ యాప్ మోసం: జూబ్లీహిల్స్ పబ్‌లో యువకుడికి రూ.29,000 బిల్లు!



**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** హైదరాబాద్‌లో ఆన్‌లైన్ డేటింగ్ యాప్‌ల ముసుగులో జరుగుతున్న మోసాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. డేటింగ్ యాప్ ద్వారా పరిచయమైన ఓ యువతితో కలిసి డేట్‌కు వెళ్లిన యువకుడు, ఏకంగా రూ. 29,000 బిల్లు చెల్లించాల్సి రావడంతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఈ ఘటన నగరంలోని జూబ్లీహిల్స్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, హేమంత్ అనే యువకుడికి 'క్వాక్-క్వాక్' అనే డేటింగ్ యాప్ ద్వారా దివ్య అనే యువతి పరిచయమైంది. వీరిద్దరూ జూబ్లీహిల్స్‌లోని '36 కెమిస్ట్రీ' పబ్‌లో కలుసుకున్నారు. అయితే, అక్కడ గడిపిన కొద్దిసేపటికే పబ్ యాజమాన్యం రూ. 29,000 బిల్లు వేసిందని హేమంత్ ఆరోపిస్తున్నాడు.ఇది పక్కా ప్రణాళికతో జరిగిన హనీట్రాప్ అని, సదరు యువతి పబ్ యాజమాన్యంతో చేతులు కలిపి తనను మోసం చేసిందని హేమంత్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటనపై బాధితుడు వెంటనే జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హేమంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున పూర్తి వివరాలు వెల్లడించడానికి పోలీసులు నిరాకరించారు. ఈ ఉదంతంతో డేటింగ్ యాప్‌ల వినియోగదారుల్లో మరోసారి ఆందోళన వ్యక్తమవుతోంది.

# చంద్రబాబు విజన్, మోదీ సహకారంతో గ్రామీణ ప్రగతి పరుగులు పెడుతోంది: పవన్ కల్యాణ్



**అమరావతి, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల స్వరూపాన్ని మార్చే లక్ష్యంతో చేపట్టిన 'పల్లె పండుగ 3.0' కార్యక్రమం నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభమైంది. రామాపురంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. రాబోయే సంవత్సరాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాల ద్వారా రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా రూ.1.30 లక్షల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని ప్రకటించారు.

**గత ప్రభుత్వంతో పోలిస్తే పది రెట్ల అభివృద్ధి**

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వ పాలనతో ప్రస్తుత కూటమి ప్రభుత్వ పనితీరును పవన్ కల్యాణ్ పోల్చిచూపారు. "వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో 880 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, మేము కేవలం రెండేళ్లలోనే దానికి పది రెట్లు ఎక్కువగా దాదాపు 9,000 కిలోమీటర్లకు పైగా పూర్తి చేశాం. వారు 304 మినీ గోకులాలు నిర్మిస్తే, మేము 30,000కు పైగా నిర్మించాం. 304 ఎక్కడ, 30,000 ఎక్కడో ప్రజలు ఆలోచించాలి" అని అన్నారు. సీఎం చంద్రబాబు దార్శనికత, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గ్రామీణ ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నామని తెలిపారు.

**రూ.11,085 కోట్లతో 'పల్లె పండుగ 3.0'**

'పల్లె పండుగ 3.0' కార్యక్రమాన్ని రూ.11,085 కోట్ల బడ్జెట్‌తో ప్రారంభిస్తున్నట్లు పవన్ కల్యాణ్ ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.5,400 కోట్లు కాగా, రాష్ట్ర ప్రభుత్వం రూ.5,700 కోట్లు భరిస్తోందని వివరించారు. ఈ నిధులతో 6,000 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 9,500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 22,500 మినీ గోకులాలు, 50 వేల ఎకరాల్లో పండ్ల తోటలు, వెయ్యి కిలోమీటర్ల డ్రైన్లు, గ్రామ పంచాయతీ భవనాలు, బస్ షెల్టర్లు, రచ్చబండలు వంటి అనేక పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చారిత్రక ప్రాధాన్యత, వలసల సమస్య కారణంగానే ఉదయగిరిని ఈ కార్యక్రమానికి వేదికగా ఎంచుకున్నామని స్పష్టం చేశారు.

**ఉదయగిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు**

ఉదయగిరి నియోజకవర్గానికి మహర్దశ పట్టబోతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి గతంలో నిలిచిపోయిన సుజలా ప్రవంతి పథకాన్ని రూ.52 కోట్లతో పునరుద్ధరించి 381 పనులు చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఉదయగిరి కోటకు వెళ్లేందుకు రూ.2.5 కోట్లతో రహదారి మంజూరు చేస్తున్నామని, అటవీ అనుమతులు త్వరగా పొందేలా అధికారులను ఆదేశిస్తున్నామని తెలిపారు. ఉదయగిరి కోటను హెరిటేజ్, ఎకో టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమీకరిస్తామని వెల్లడించారు.

**అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ముఖ్యం**

అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ఇందులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. "మీ గ్రామంలో జరుగుతున్న పనులను ప్రజలు తమవిగా భావించి పర్యవేక్షించాలి. కాంట్రాక్టర్లు నాణ్యతగా పనిచేస్తున్నారా లేదా అని గమనించాలి. లోపాలు కనిపిస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. అవసరమైతే సోషల్ ఆడిట్ నిర్వహిస్తాం. వెచ్చించే ప్రతి రూపాయి సద్వినియోగం కావాలి" అని కోరారు. రైతుల కోసం డొంక రోడ్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభిస్తున్నామని, గిరిజన ఆవాసాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పవన్ కల్యాణ్ వివరించారు. ఈ కార్యక్రమానికి అపూర్వ స్వాగతం పలికిన ప్రజలకు, విజయవంతం చేసిన అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో కొట్టిస్తానన్న కొండా సురేఖ

**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొండా సురేఖ తనదైన శైలిలో రాజకీయ ప్రత్యర్థులకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం వరంగల్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ, నోరు అదుపులో పెట్టుకోకపోతే మహిళలతో దేహశుద్ధి చేయిస్తానని ఘాటుగా హెచ్చరించారు. కొంతమంది నేతల తీరుపై కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇష్టానుసారం మాట్లాడితే మహిళలతో చిత్తుచిత్తుగా కొట్టిస్తాం. ఒక్కో మహిళ నలుగురిని కొడుతుంది, జాగ్రత్త. ప్రతిపక్ష నేతలు గాలిలో కత్తులు తిప్పుతున్నారు" అంటూ ఆమె ధ్వజమెత్తారు. కొందరు నేతలు తమ హద్దులు మీరుతున్నారని, అలాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో పార్టీ అంతర్గత పరిణామాలపైనా ఆమె స్పందించారు. కాంగ్రెస్ నేతలంతా విభేదాలను పక్కన పెట్టి, పార్టీ బలోపేతం కోసం



సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులంతా ఐక్యంగా ఉంటేనే పార్టీ ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఆమె సూచించారు.

## బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి వివాదం : హైకోర్టు కీలక ఆదేశాలు

**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోలీసుల మధ్య జరిగిన ఘర్షణపై తెలంగాణ హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించారన్న పోలీసుల వాదనకు ఆధారాలు లేవని స్పష్టం చేసింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల దురుసుగా ప్రవర్తించిన పోలీసులను గుర్తించాలని డీజీపీ సీవీ ఆనంద్‌ను ఆదేశించింది. ఈ ఘటనకు బాధ్యులైన పోలీసు అధికారులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకునేలా సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని హైకోర్టు సూచించింది. ఆ నివేదికను అసెంబ్లీ స్పీకర్ ముందు ఉంచాలని డీజీపీకి ఆదేశాలు జారీ చేసింది. పోలీసులు స్పీకర్ ఆదేశాల మేరకే వ్యవహరించి ఉంటే.. వారిపై చర్యలు తీసుకునే అంశం స్పీకర్ పరిధిలోకి వస్తుందని ధర్మాసనం స్పష్టం చేసింది. అసెంబ్లీ వ్యవహారాల్లో స్పీకర్‌కు ఉన్న అధికారాలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఈ వ్యవహారంపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను తాజాగా సవరించింది. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై పూర్తి వివరాలను సేకరించాలని ఆదేశించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాల సందర్భంగా గేటు వద్ద ఈ ఘర్షణ చోటుచేసుకున్న విషయం తెలిసిందే. పోలీసులు తమతో దురుసుగా ప్రవర్తించారని బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ వ్యవహారం హైకోర్టుకు చేరింది. తాజాగా కోర్టు ఇచ్చిన ఆదేశాలతో ఈ అంశం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశమైంది.

## కేటీఆర్ వ్యాఖ్యలపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ఆగ్రహం

**హైదారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ వైఫల్యాలను, చేతగానితనాన్ని కేసీఆర్‌పై నెట్టడం ఏంటని ప్రశ్నించారు. గుంటనక్క మైండ్‌గేమ్‌లో పడి పార్టీ అధినేతనే తప్పుబడుతున్నారని మండిపడ్డారు. తనతో పెట్టుకోవద్దని, నిర్దిష్టమైన ఆధారాలతో అన్ని విషయాలు బయటపెడతానని హెచ్చరించారు. నియోజకవర్గానికి ఎమ్మెల్యేనే సీఎం అని కేసీఆర్ చెప్పడం వల్లే సమస్యలు తమ వరకు రాలేదని కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై కవిత 'ఎక్స్' వేదికగా స్పందించారు. కూర్చున్న కొమ్మనే నరుక్కున్నట్లు పార్టీ వైఫల్యాలను కేసీఆర్‌పై మోపుతున్నారని విమర్శించారు. ఇలా చేస్తూ బీఆర్ఎస్‌కు గోతులు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఓ అవినీతి వ్యక్తిని విమర్శిస్తే కొన్ని గంటల్లోనే సస్పెండ్ చేశారని కవిత పేర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు అదే వ్యక్తితో కలిసి ఉంటూ, కేసీఆర్ తీరుతోనే పార్టీకి నష్టం జరిగిందని బహిరంగంగా వ్యాఖ్యానించడం పార్టీ వ్యతిరేక చర్య కాదా అని ప్రశ్నించారు. పార్టీ అధినేతను, ఆయన తీసుకున్న విధానపరమైన నిర్ణయాలను బహిరంగంగా తప్పుబట్టడం ఏంటని నిలదీశారు. ఫామ్‌హౌస్‌లు, అక్రమంగా ఇచ్చిన అనుమతులు, ఆంధ్రా స్నేహితులకు ఇచ్చిన ప్రయోజనాలు, క్విడ్ ప్రో కో వ్యవహారాలతో బీఆర్ఎస్‌ను పాతాళంలోకి నెట్టింది మీరే అంటూ కేటీఆర్‌పై కవిత ఆరోపణలు చేశారు. ఇటీవల బీఆర్ఎస్ సమావేశంలో ఓ రైతు ఫోన్‌లో మాట్లాడుతుంటే ఆయన భార్యను అవమానించేలా వ్యాఖ్యలు చేశారని విమర్శించారు.

# భారత రైల్వేలో సరికొత్త ప్రయోగం

(మొదటి పేజీ తరువాయి)

ఇన్సులేటెడ్ ఎల్ఎన్‌జీ ట్యాంక్‌ను అమర్చారు. ఇది అత్యంత శీతల ఉష్ణోగ్రతల్లో ఇంధనాన్ని సురక్షితంగా నిల్వ చేస్తుంది. ఈ డ్యూయల్ ఫ్యూయల్ విధానం ద్వారా డీజిల్ వాడకాన్ని దాదాపు 40 శాతం వరకు తగ్గించవచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ట్రయల్ రన్స్‌లో వెల్లడైన వివరాల ప్రకారం, ఒక్కో డ్రైవింగ్ పవర్ కారుకు ఏటా సుమారు రూ.11.9 లక్షల వరకు ఇంధన ఖర్చు ఆదా అయ్యే అవకాశం ఉంది. ఈ రైలును అధికారికంగా ప్రారంభించడానికి ముందు 2,000 కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయిలో విజయవంతంగా పరీక్షించారు.

# పోలీసులతో పాలన సాగిస్తున్నారు: బొత్స

(మొదటి పేజీ తరువాయి)

అణచివేస్తున్నారని మండిపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందని, ఉన్నత చదువులు చదివిన వారికి ఎలాంటి అవకతవకలకు తావులేకుండా ఉద్యోగాలు కల్పించిందని గుర్తుచేశారు. అలాగే, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు అరటి, బొప్పాయి, మొక్కజొన్న, వరి పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

# బొగ్గు కొనుగోలుపై ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుబట్టిన కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలకు సైతం బొగ్గును సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సింగరేణి బొగ్గుతోనే టీఎస్ జెన్‌కో నిరంతరాయంగా 24 గంటల విద్యుత్ సరఫరాను అందించిందని వివరించారు. రాష్ట్రంలోనే పుష్కలమైన వనరులు ఉండగా, వాటిని కాదని అధిక ధర చెల్లించి దిగుమతి చేసుకోవడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు.

# అనుమతులు ఇప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించామని, నీటిపారుదల ప్రణాళిక, అంతర్రాష్ట్ర అంశాలకు సంబంధించిన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఈ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం పొందేందుకు తాము చర్చిస్తున్నామని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) ఆధ్వర్యంలో చేపడుతున్న టెలిమెట్రీ యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాల ఏర్పాటుకు అవసరమైన రూ.4.15 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే జమ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మొదటి దశ టెలిమెట్రీ యంత్రాలను ఏర్పాటు త్వరగా పూర్తి చేయడంతో పాటు రెండు, మూడో దశలకు సంబంధించిన యంత్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎమ్మెల్యే గడ్డం వినోద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (నీటిపారుదల) ఆదిత్యనాథ్ దాస్, సీఎం సెక్రటరీ మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

# డేటింగ్ యాప్ మోసం

(మొదటి పేజీ తరువాయి)

ధరలు, అంతర్జాతీయ బాండ్ ఈల్డ్స్‌లో కొనసాగుతున్న ఒడుదొడుకులు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌పై ప్రభావం చూపాయి. దీంతో పలు రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ 242.65 పాయింట్లు నష్టపోయి 72,529.07 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 64.05 పాయింట్లు తగ్గి 22,716.20 వద్ద ముగిసింది. నిఫ్టీలో టైటన్ కంపెనీ అత్యధికంగా నష్టపోయిన షేర్‌గా నిలిచింది. ఐటీ షేర్లలో విప్రో, హెచ్‌సీఎల్‌టెక్ కూడా ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ అమ్మకాలు కొనసాగాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.99 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.81 శాతం పడిపోయాయి.

# పాలనలో కొత్త ఒరవడి నైపుణ్యాలే అభివృద్ధికి చోదకశక్తి

(మొదటి పేజీ తరువాయి)

అమలు చేస్తున్నారు. ప్రజలకు అందే సేవల నాణ్యత ఎంత మెరుగుపడుతోందన్న అంశమే ప్రామాణికత అని సీఎం స్పష్టం చేశారు.

**కెపాసిటీ బిల్డింగ్‌లో ఏపీకి మొదటి స్థానం**

ప్రభుత్వ ఉద్యోగుల కెపాసిటీ బిల్డింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ రాష్ట్రంగా మొదటి స్థానాన్ని సాధించింది. ఈ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ఏపీఎస్‌డీపీఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీఆర్ అలపర్తి అందుకున్నారు. రెండో స్థానంలో నిలిచిన కర్ణాటక, మూడో స్థానంలో నిలిచిన ఒడిశా రాష్ట్రాలకు కూడా సీఎం అవార్డులు అందజేశారు. మిషన్ కర్మయోగి కింద ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 7.89 లక్షల మంది ఉద్యోగులు ఐగాట్‌లో నమోదు అయ్యారని సీఎం తెలిపారు. రాష్ట్రంలో రెండు కోట్లకు పైగా కోర్సులు పూర్తి చేసి దేశంలోని రాష్ట్రాల్లో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. రెండు కోట్ల సర్టిఫికెట్ల కంటే నేర్చుకున్న అంశాలే కీలకమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అందే సేవల్లో మార్పుగా ఈ అంశాలు కనిపించాలని అని సీఎం అన్నారు. శిక్షణతో ఓ రెవెన్యూ అధికారి పౌరుడి సమస్యను వేగంగా పరిష్కరించటం, ఉపాధ్యాయుడు తరగతి గదిలో మెరుగైన బోధన అందించటం.. పోలీసు అధికారి మరింత మానవీయంగా స్పందించటం ముఖ్యమని సీఎం స్పష్టం చేశారు. పూర్తి చేసుకున్న శిక్షణతో పౌరులకు నాణ్యమైన సేవలు అందుతున్న తీరుకు కొలమానంగా ఉండాలని సూచించారు.

# మట్టి వినాయకులను పూజిద్దాం - పర్యావరణంను పరిరక్షిద్దాం

### - యాంకర్ ప్రదీప్ మాచిరాజు



**శేరిలింగంపల్లి, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** కొండాపూర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో 9 సి-బ్లాక్‌లో వినాయక చవితి పర్వదినంను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద చివరిరోజు శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీ గణపతి మహిళా స్వశక్తి సంఘం, కేఆర్ఆర్ ఉత్సవ సమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజ కార్యక్రమం మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్చార్జి జగదీశ్వర్ గౌడ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రవి యాదవ్, చాంద్ పాషాలతో పాటు ఉత్సవ సమితి సభ్యులు కే. నిర్మల, కే. శత కుమారి, కే. కుమారి, ఏ. శిల్ప, సువర్ణ, బిక్షమయ్య, నారాయణ రెడ్డి, సుధ, కవిత. మదుగాత్రి. ఎం. శ్రీనివాస్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజు, సీనియర్ నాయకులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజలందరికీ వినాయక చవితి పర్వదినం శుభాకాంక్షలు తెలియచేస్తున్నానని, మీ జీవితంలోని సకల విఘ్నాలను తొలగించి, విజయాలను అందించాలని, సమస్త శుభాలు, సంతోషాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి అనుగ్రహం మీపై ,మీ కుటుంబ సభ్యులపై ఎల్లప్పుడూ ఉండాలని మనసారా కోరుకుంటూ వినాయకుని ఆశీస్సులతో చదువులకు, వృత్తి, ఉద్యోగానికి, విదేశాలకు వెళ్లే వారికి అవకాశాలు రావాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు. మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూనే భక్తితో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను కలిగి పర్యావరణాన్ని పరిరక్షించాలనే ఉన్నతమైన లక్ష్యంతో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మట్టి వినాయకులను పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖుల కు " నకోడా జ్యూవలర్స్ " ప్రతినిధి సందీప్ వెండి వినాయక ప్రతిమలను జ్ఞాపికలుగా అందజేసారు.

# విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు మౌలిక వసతులపై వీడియో కాన్ఫరెన్స్





**కామారెడ్డి, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా కలెక్టర్లతో సోమవారం ప్రభుత్వ సంక్షేమ రెసిడెన్షియల్ సంస్థలు మరియు సంక్షేమ వసతి గృహాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, మౌలిక వసతులు మరియు ఇతర సంబంధిత అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ వి.వి. విక్టర్, ఙూజణఉ పి. వెంకటేష్, ఙణఉ సౌజన్య, ఙదీజణఉ నర్సయ్య, ఙజుఉ మల్లికార్జున్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రెసిడెన్షియల్ విద్యా సంస్థలు మరియు సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, పరిశుభ్రత, మౌలిక వసతులు, భద్రత మరియు అవసరమైన సౌకర్యాలను సమర్థ వం తంగా. కల్పించడంపై ప్రధానంగా చర్చించారు.

# ఆర్.ఎం.పి పి.ఎం.పి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా తోట అనిల్ కుమార్



**ములుగు, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** ములుగు జిల్లా కేంద్రంలో ఆర్ఎంపి పి.ఎం.పి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్ ఎన్ హరిబాబు ఆధ్వర్యంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగా తోట అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన ఆర్.ఎం.పి, పి ఎంపీలకు కృతజ్ఞతలు తెలిపారు. అనిల్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వైద్యం అందించే ఆర్ఎంపీల సమస్యలపై మాట్లాడుతూ గ్రామీణ వైద్యులపై కక్ష సాధింపుగా పెట్టుకుని దాడులు జరుపుతున్నారని అమాయక గ్రామీణ వైద్యులను ఇబ్బందులు గుర్తిస్తారు అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఆర్ఎంపీలు పడుతున్న ఇబ్బందులపై పోరాటానికి నా వంతు కృషి చేస్తారని అన్నారు. ఆర్ఎంపీలను గుర్తించి శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక వైద్యం అందించేలా ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.

# శ్రీ శివరామ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**మునుగోడు, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :**

మునుగోడు మండల కేంద్రంలోని శ్రీ శ్రీ శ్రీ శివరామ ఆలయంలో సోమవారం మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారిని వివిధ రకాల పూలతో అలంకరించారు. ఈ సందర్భంగా మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఆలయ అర్చకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట భీమనపల్లి సైదులు, పాలకూరి నరసింహ గౌడ్, పాల్వాయి చెన్నారెడ్డి, తీర్వారి ఆంజనేయులు, పెరుమాళ్ళ ప్రమోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**అడవిదేవులపల్లి, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ సంక్షేమ బాటలో పయనిస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ అన్నారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన పట్టణంలోని ఎస్వీ గార్డెన్స్‌లో సోమవారం అడవిదేవులపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించి, అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు బాలు నాయక్,బండి చేతుల మీదగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా పొదిల శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని కొనియాడారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బ్యాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రమావత్ బాలు నాయక్,మండల కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు,చిట్యాల సర్పంచ్ నక్క వెంకటేశ్వర్లు,ముదిమాణిక్యం సర్పంచ్ రామావత్ వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వీరాంజనేయులు,వార్డు మెంబర్లు వీరబోయిన వెంకటేశ్వర్లు, అన్నెబోయిన వెంకాయమ్మ,పేర్ల సరోజిని,కుర్ర అశోక్ నాయక్,పసుపులేటి శ్రీనివాస్, నారాయణ, అన్నెబోయిన మల్లికార్జున్,నరేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలి




**సిద్దిపేట, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో డిస్ట్రిక్ట్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కమిటీ జిల్లాలో పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహం, మరియు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు సంబంధించిన అంశాలను పర్యవేక్షించే జిల్లా స్థాయి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ హైమావతి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలోని యువతకి ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడం కోసం జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని, పరిశ్రమలకు సంబంధించిన దరఖాస్తులు, అనుమతులు మరియు సమస్యలను క్షేత్రస్థాయిలో సమీక్షించాలని సంబంధిత శాఖ ల అధికారులను ఆదేశించారు. పెట్టుబడిదారులకు అవసరమైన సహాయం, సమన్వయం అందించాలని జిల్లా పరిశ్రమల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి గణేష్ రామ్, ఇరిగేషన్ ఈ ఈ నాగరాజు, ఏంపిఐ శ్రీకాంత్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అంబటి ప్రభాకర్



**నందిగామ, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం మేకగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నూతన కమిటీ చైర్మన్‌గా అంబటి ప్రభాకర్, వైస్ చైర్మన్‌గా విఘ్నేశ్వర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.చైర్మన్ అంబటి ప్రభాకర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ఎరువులు, విత్తనాల పంపిణీ, రైతు రుణాలు సజావుగా సాగేలా కమిటీ తో కలిసి చర్యలు తీసుకుంటామని రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ రైతుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ ముందుంటామని తెలిపారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు వార్డు మెంబర్ బండారిరాజు, యూత్ కాంగ్రెస్ నాయకుడు సాయి కిరణ్ రెడ్డి. మేకగూడ సహకార సంఘం ఎన్నికల్లో మొదలైన గందరగోళానికి ముగింపు పలికింది అని, గత పాలనలో మేకగూడ సహకార సంఘంలో జరిగిన పనుల రికార్డులు పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవరకొండ ఎంఆర్పిఎస్ అధ్యక్షులుగా శ్రీశైలం మాదిగ

### గ్రామస్థాయి నుంచి సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయాలి

**దేవరకొండ, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** దేవరకొండ పట్టణం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఎంఆర్పిఎస్ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా దేవరకొండ మండల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు దేవరకొండ మండల కేంద్రంలోని సిల్వర్ జూబ్లీ క్లబ్‌లో నూతన మండల కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు.ఎంఆర్పిఎస్,ఎంఎస్పి జిల్లా నాయకులు పండ్ల గోపి మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఎంఆర్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి,దేవరకొండ మండల ఇన్‌చార్జి బొజ్జ చిన్న మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్టోబర్ 7న అమరావతిలో నిర్వహించనున్న ఎంఆర్పిఎస్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంస్థాగత నిర్మాణంలో భాగంగా గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు కమిటీలను పటిష్టం చేయాలని,గ్రామ కమిటీల ఏర్పాటు ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అనంతరం దేవరకొండ మండల నూతన కమిటీని ప్రకటించారు. ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా నీరుకంటి శ్రీశైలం మాదిగను ఎన్నుకోవడం జరిగింది.అధికార ప్రతినిధిగా నల్ల రాజు మాదిగ,ఉపాధ్యక్షులుగా పులిజాల మల్లేష్ మాదిగ,ముదిగొండ మహేందర్ మాదిగ,ప్రధాన కార్యదర్శిగా కుక్కముడి శ్రీనయ్య మాదిగ,సంయుక్త కార్యదర్శులుగా కుక్కముడి దేవదానం మాదిగ,గడుసు చిన మహేష్ మాదిగ,కార్యదర్శులుగా నల్ల సైదులు మాదిగ,గండు వెంకటేష్ మాదిగ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ జిల్లా సీనియర్ నాయకులు నల్ల వెంకటయ్య మాదిగ,మాతంగి కాషయ్య మాదిగ,సలికినేని జీవ,సందగళ్ల వీరయ్య మాదిగ,గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్జిగల్ల మురళీకృష్ణ మాదిగ,దేవరకొండ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జి సలికినేని రామకృష్ణ మాదిగ,కుక్కముడి అంజయ్య,పేర్ల శ్రీకాంత్, మంద చంద్రయ్య మాదిగ, దేవరకొండ నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీకి శాశ్వత ఆదాయమే లక్ష్యం

### - రూ.1.80 కోట్లతో 33 దుకాణాలు

### - శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



**జిన్నారం, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** జిన్నారం మున్సిపాలిటీకి శాశ్వత ఆదాయ వనరులు సమకూర్చే దిశగా మరో అడుగు పడింది. మున్సిపల్ కేంద్రంలో రూ.1.80 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33 దుకాణాల సముదాయానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. నూతన దుకాణాల నిర్మాణంతో మున్సిపాలిటీకి ప్రతి నెలా నిరంతర ఆదాయం సమకూరుతుందని ఎమ్మెల్యే తెలిపారు.జిన్నారం మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సహకారంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే సుమారు రూ.15 కోట్లతో ప్రతి వార్డులో వివిధ అభివృద్ధి పనులు చేపట్టి శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసినప్పుడే మెరుగైన పాలన సాధ్యమవుతుందని అన్నారు.జిన్నారం మున్సిపాలిటీ అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ కొనసాగుతుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, కమిషనర్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, రాజేష్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఉరి వేసుకుని యువకుడు మృతి



**షాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** షాబాద్ మండలం నాగర్‌కుంట గ్రామానికి చెందిన చిర్ర సునీల్ (21) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందాడు. సునీల్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సెప్టెంబర్ 27న ఉదయం సుమారు 10 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిన సునీల్ రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు, పరిచయస్తుల వద్ద ఆరా తీస్తూ అతని కోసం గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో నాగర్‌కుంట రహదారి సమీపంలోని ఓ భూమిలో సునీల్ మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ఘటనపై షాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సునీల్ మృతికి గల కారణాలు, ఇతర పరిస్థితులపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. యువకుడి ఆకస్మిక మృతితో నాగర్‌కుంట గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తు అనంతరం వెల్లడించే అవకాశం ఉంది.

# 26 ఏళ్ల తర్వాత ఒక్కటైన 1999-2000 పదో తరగతి విద్యార్థులు

### కంటతడి పెట్టిన గురుశిష్యుల అనుబంధం.. చిన్ననాటి జ్ఞాపకాలతో మార్మోగిన ప్రాంగణం



**రామారెడ్డి, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** రామారెడ్డి మండలం రెడ్డి పేట గ్రామంలో 2000 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు కాలచక్రం గిర్రున తిరిగినా.. వయసు మీదపడుతు న్నా.. నాటి మధుర జ్ఞాపకాలు మాత్రం చెరిగిపోలే దని నిరూపించారు ఆ పూర్వ విద్యార్థులు. చదు వుల ఒడిని వీడి పాతికేళ్లు దాటినా, ఆటపాటలు పంచుకున్న పాఠశాల ప్రాంగణం, అక్షరాలు దిద్దిం చిన గురువులను వారు మర్చిపోలేదు. 1999-2000 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులంతా ఏకమై రెడ్డిపేటలో ఆదివా రం నిర్వహించిన 'ఆత్మీయ సమ్మేళనం' పండుగ వాతావరణాన్ని తలపించింది. సరిగ్గా 26 సంవత్స రాల సుదీర్ఘ విరామం అనంతరం నాటి మిత్రులం తా ఒకే వేదికపైకి చేరడంతో ఆ ప్రాంగణ మంతా ఆనంద భాష్పాలతో, కేరింతలతో పులకించిపో యింది.గురుపూజోత్సవ స్ఫూర్తితో ఘన సన్మా నం ఈ కార్యక్రమానికి నాడు తమకు విద్యాబుద్ధు లు నేర్పిన గురువులు వెంకట గౌడ్, హనుమంత్ రెడ్డి, శంకరయ్య, రాజలింగం, వెంకటరమణ ము ఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిష్యులు వారిని సాదరంగా ఆహ్వానించి, పూలమాలలు, శాలువాల తో ఘనంగా సత్కరించారు. కాళ్లకు మొక్కి ఆశీ ర్వాదం తీసుకుంటూ పలువురు విద్యార్థులు భావో ద్వేగానికి లోనయ్యారు. తమ చేతుల మీదుగా చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత శిఖరాల ను అధిరోహించి, సమాజంలో బాధ్యతాయుత మైన పౌరులుగా ఎదగడం చూసి గురువులు గర్వ పడ్డారు. విద్యార్థులను అక్కున చేర్చుకుని ఆశీర్వ దించారు.తీపి గుర్తులు.. నాటి జ్ఞాపకాలు వివిధ ప్రాంతాలు, నగరాలు, విదేశాల్లో స్థిరపడిన విద్యా ర్థులంతా అన్ని పనులను పక్కనపెట్టి ఈ వేడుక కోసం రెడ్డిపేటకు తరలివచ్చారు. దశాబ్దాల తర్వా త కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసు కుంటూ, నాటి తుంటరి చేష్టలు, పాఠశాల విరామ సమయాల్లో పంచుకున్న కబుర్లు, తరగతి గది అల్లర్లను గుర్తుచేసుకున్నారు. ఒకరి యోగక్షేమాల ను మరొకరు అడిగి తెలుసుకుంటూ చిన్నపిల్లల్లా మారి పోయారు. కుటుంబసభ్యుల పరిచయాలు, సెల్ఫీలు, గ్రూప్ ఫోటోలతో రోజంతా సందడిగా గడిచింది.తోటి మిత్రులకు అండగా ఉంటాం ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ.. 26 ఏళ్ల తర్వాత ఇలా అందరినీ కలవడం జీవితం లో ఎప్పటికీ మర్చిపోలేని అనుభూతిని ఇచ్చిందని ఆనందం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కూడా ఇదే అనుబంధాన్ని కొనసాగిస్తామని, సమాజ సేవ తో పాటు తమ బ్యాచ్‌లోని మిత్రులకు ఏ ఆపద వచ్చినా ఒకరికొకరం అండగా నిలుస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గురువులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ ఆత్మీయ కలయిక రెడ్డిపేట పరిసర ప్రాంతాల్లో స్థానికులను విశేషంగా ఆకట్టు కుంది.

# ఎంపీడీవో శ్రీనివాస్ సేవలు మరువలేనివి - రాయపోల్ మండలం సర్పంచులు



**రాయపోల్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** రాయపోల్ మండల ఎంపీఓ, ఎంపీడీవోగా విధులు నిర్వహించి బదిలీపై మద్దూరు మండలానికి వెళ్లిన డా. చిలుముల శ్రీనివాస్ సేవలు చిరస్మరణీయమని పలువురు సర్పంచులు, అధికారులు కొనియాడారు. మండల అభివృద్ధి, గ్రామాల సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలులో ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. ఈ సందర్భంగా రాయపోల్ ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వీడ్కోలు సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని డా. చిలుముల శ్రీనివాస్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఏడేళ్ల సుదీర్ఘ కాలంలో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో ఆత్మీయ సంబంధాలను పెంచుకున్న శ్రీనివాస్ బదిలీ కావడం బాధాకరమని పలువురు పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కార్యక్రమాలను సమన్వయం చేస్తూ, సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు ఆయన చేసిన కృషిని గుర్తుచేసుకున్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణతో పాటు అందరితో కలుపుగోలుగా మెలిగిన తీరు ఎప్పటికీ గుర్తుండిపోతుందని అన్నారు. మండల అభివృద్ధి కార్యక్రమాల్లో శ్రీనివాస్ చూపిన చొరవ, అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం సాధించిన తీరు రాయపోల్ మండల ప్రజలకు గుర్తుండిపోతుందని పలువురు అన్నారు. పదవి మారినా ఆయనతో ఏర్పడిన ఆత్మీయ అనుబంధం కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం మద్దూరు మండలానికి బదిలీపై వెళ్తున్న శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్ రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ముత్తాలీఫ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మున్నా, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# మిర్యాలగూడలో వైభవంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**అడవిదేవులపల్లి, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ సంక్షేమ బాటలో పయనిస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్ అన్నారు. మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అధ్యక్షతన పట్టణంలోని ఎస్వీ గార్డెన్స్‌లో సోమవారం అడవిదేవులపల్లి మండలానికి చెందిన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించి,అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్,మండల పార్టీ అధ్యక్షుడు బాలు నాయక్,బండి చేతుల మీదగా లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.?ఈ సందర్భంగా పొదిల శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని కొనియాడారు.ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ బ్యాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొదిల శ్రీనివాస్,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రమావత్ బాలు నాయక్, మండల కాంగ్రెస్ నాయకులు బండి నాగేశ్వరరావు, చిట్యాల సర్పంచ్ నక్క వెం కటేశ్వర్లు, ముదిమాణిక్యం సర్పంచ్ రామావత్ వెంకటేశ్వర్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వీరాంజనేయులు, వార్డు మెంబర్లు వీరబోయిన వెంకటేశ్వర్లు, అన్నెబోయిన వెంకాయమ్మ, పేర్ల సరోజిని, కుర్ర అశోక్ నాయక్, పసుపులేటి శ్రీనివాస్, నారాయణ, అన్నెబోయిన మల్లికార్జున్, నరేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

# అక్కినేని జయంతి వేడుకల్లో ‘ఆ పాట మధురాలు’

### -‘నా ప్రపంచ యానం-నా ఆలోచనలు-నా అనుభవాలు’ పుస్తకావిష్కరణ




**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** శ్రీ ధ్యుతి మ్యూజికల్ అకాడమీ, ఇషాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు జయంతిని పురస్కరించుకుని ‘ఆ పాట మధురాలు’ సంగీత విభావరి ఘనంగా జరిగింది. 80కి పైగా పాత-కొత్త గీతాలను పి.వి.రమణమూర్తి, ఎం.బి.రవికుమార్, కళ్యాణి దేశ్‌పాండే, ప్రసన్న విజయ్‌కుమార్, సౌమ్య, సవిత శ్రీ, పేరి నాగేశ్వరరావు- విజయలక్ష్మి దంపతులు ఆలపించారు. లయన్ పేరి నాగేశ్వరరావు రచించిన ‘నా ప్రపంచ యానం-నా ఆలోచనలు-నా అనుభవాలు’ పుస్తకాన్ని తెలంగాణ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్ ఆవిష్కరించారు. సిండికేట్ బ్యాంక్ మాజీ అసిస్టెంట్ మేనేజర్ కామేశ్వరరావు, పణిగిరి సాయిబాబా టెంపుల్ చైర్మన్ శ్రీనివాస నాయుడు, సమస్త అధ్యక్షుడు కళా జనార్ధన్ మూర్తి, కందాళ శ్రీనివాస్ ప్రసంగించారు.

# మూసీనది పరిరక్షణతోనే హైదరాబాద్ భవిష్యత్తు

### -ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్ చైర్మన్ ప్రొ.మణికొండ వేదకుమార్




**హైదరాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** మూసీ నది, సహజ ప్రవాహ మార్గాలు, చెరువులను పరిరక్షించడంతోనే హైదరాబాద్ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని ఫోరం ఫర్ ఎ బెటర్ హైదరాబాద్(ఎఫ్.బి.హెచ్) చైర్మన్ ప్రొ.మణికొండ వేదకుమార్ అన్నారు. 1908 మూసీ వరదల బాధితులకు నివాళులర్పిస్తూ సోమవారం ఉస్మానియా జనరల్ ఆసుపత్రి (ఓజీహెచ్) ప్రాంగణంలోని చారిత్రక చింతచెట్టు వద్ద ఎఫ్.బి.హెచ్ ఆధ్వర్యంలో స్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ‘ఐ విట్నెస్ అకౌంట్స్ ఆన్ రివర్ మూసి ఫ్లడ్స్ ఆఫ్ 1908’ పుస్తకాన్ని వేదకుమార్, పరాశర్ ఆవిష్కరించారు. దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ ప్రచురించిన ఈ పుస్తకాన్ని డా.ద్యావనపల్లి సత్యనారాయణ రచించారు. 1908 వరదలపై పరాశర్ లావణి ప్రదర్శించగా, చారిత్రక కథనాలను యువతకు ఫోటోలు, మ్యాపులు, యాని మేషన్ల ద్వారా పరిచయం చేయాలని వేదకుమార్ సూచించారు. ఎఫ్.బి.హెచ్ జనరల్ సెక్రటరీ శోభా సింగ్, సభ్యుడు ఆదర్శ్, కోఆర్డినేటర్ సయ్యద్ ఖైసర్, హరికిషన్, వేణుగోపాల్, ఆర్కిటెక్ట్ రామ్ రాజ్, జెబిఆర్ ఆర్కిటెక్చర్, ఫార్మసీ, ఇంజినీరింగ్ అధ్యాపకులు సోనూ కుమార్, ప్రత్యూష, సిరీష, ఆక్స్ ఫర్డ్ గ్రామర్ స్కూల్ అధ్యాపకులు, విద్యార్థులు, దక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**బెజ్జంకి, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తిప్పారపు సురేష్(45)ఏపీ 29 ఎల్ 7345 నెంబర్ గల తన స్వంత మోటారు సైకిల్ వాహనంపై ఆదివారం ఉదయం తన ఇంటి నుండి వెళ్ళినారు.ఆదివారం రాత్రి సుమారు 8:30 గంటలకు బెజ్జంకి క్రాసింగ్ వద్ద గల గుగ్గిళ్ల గ్రామానికి వెళ్ళే కూడలి వద్ద సురేష్ తన మోటారు సైకిల్ పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 3:01 గంటలకు సమయంలో సురేష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య తిప్పారపు రజిత ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

# ఆలయ నిర్మాణాని ఎంపీ రూ.20 లక్షలు



**దుబ్బాక, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** దుబ్బాక పట్టణం నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ నిర్మాణానికి మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావును ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం కలిశారు. సందర్భంగా ఆలయ నిర్మాణానికి ఎంపీ రఘునందన్ రావు 20 లక్షల రూపాయలను ఇస్తానని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎంపీకి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణమ్మగారి సుభాష్ రెడ్డి, గన్నే భూంరెడ్డి వడ్లకొండ శ్రీధర్, గన్నె బుచ్చిరెడ్డి, పల్లె బోస్ తదితరులు పాల్గొన్నారు.

# దోమకొండ ఆబ్కారి సీఐ సర్వేశ్వరరావుకు సన్మానం



**దోమకొండ, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** కామారెడ్డి జిల్లా దోమకొండ ఆబ్కారి సీఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్వేశ్వరరావుకు సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఐరేణి నరసయ్య, ఉపసర్పంచ్ బొమ్మెర శ్రీనివాస్‌లు శాలువా కప్పి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పాలకుర్తి శేఖర్, చింతల స్వామి ఎస్సై దీపిక తదితరులు పాల్గొన్నారు.

# మతిస్థిమితం లేని బాలుడిని అన్నం సేవా ఫౌండేషన్‌కు అప్పగించిన చింతకాని ఎస్ఐ



**చింతకాని, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** చింతకాని మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో కొన్ని రోజులుగా మతిస్థిమితం లేని బాలుడు రోడ్లపై తిరుగుతూ కనిపిస్తున్నాడు. ఈ విషయాన్ని స్థానికులు చింతకాని ఎస్ఐ జి. నరేష్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎస్ఐ జి. నరేష్ ఖమ్మంలోని అన్నం సేవా ఫౌండేషన్ నిర్వాహకులకు సమాచారం అందించారు. అనంతరం అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అన్నం శ్రీనివాసరావుకు బాలుడిని అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ.. మండల పరిధిలో మతిస్థిమితం లేని వారు లేదా ఆపదలో ఉన్న వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. బాలుడికి ఆశ్రయం కల్పించేందుకు ముందుకు వచ్చిన అన్నం సేవా ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ అన్నం శ్రీనివాసరావుకు స్థానిక ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి - అదనపు కలెక్టర్

**నల్లగొండ, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు.అన్ని శాఖల్లో పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను కూడా పరిశీలించి పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, వారి సమస్యను అర్థం చేసుకుని సకాలంలో పరిష్కారం చూపాలని తెలిపారు. ముఖ్యమంత్రి ప్రజావాణికి సంబంధించిన దరఖాస్తులను ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉంచకుండా త్వరగా పరిష్కరించాలని అధికారులతో కోరారు. పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి వారం రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం

### ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ

### ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



**దుబ్బాక, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** దుబ్బాక నియోజకవర్గంలోని గురుకుల పాఠశాలల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. దుబ్బాక మండలం హబ్సీపూర్‌లోని మహాత్మా జ్యోతిబా ఫూలే గురుకుల పాఠశాల, చెప్యాల్ చౌరస్తాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, వారికి అనుకూలమైన విద్యా వాతావరణాన్ని అందించేందుకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు పంపిణీ**

దుబ్బాక మున్సిపల్ పరిధిలోని పలు వార్డులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... లబ్ధిదారులకు మంజూరైన ఇంద్ర మహిళను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్, కమిషనర్ మహేష్ కుమార్, వివిధ వార్డుల కౌన్సిలర్లు, బి ఆర్ఎస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఇల్లందుల శ్రీనివాస్, తాజా, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు అవసరమగు పరికరాలు అందించండి

### జిల్లా కలెక్టర్‌కు విన్నవించిన దివ్యాంగులు




**వికారాబాద్, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** ప్రభుత్వం దివ్యాంగులకు బాసటగా ఉంటూ వారికి అవసరమగు పరికరాలు అందించాలని బివి ఎచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు పోతురాజు సుధీర్ అన్నారు. భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో సోమవారం వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీని కలసి దివ్యాంగులు విన్నతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... వికారాబాద్ జిల్లాలోని దివ్యాంగులకు వివిధ రకాల సహాయ పరికరాలు అందించేందుకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, అవసరమైన పరికరాలను మంజూరు చేయవలసిందిగా కోరారు. జిల్లాలోని దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి మరియు హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో అనేకమంది దివ్యాంగులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా తమ నిత్యజీవిత అవసరాలకు ఉపయోగపడే సహాయ పరికరాలను కొనుగోలు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా నడవడానికి, వినడానికి, చూడడానికి మరియు స్వతంత్రంగా జీవించడానికి అవసరమైన పరికరాలు అందుబాటులో లేకపోవడం వల్ల బ్రతకు ఇబ్బందిగా మారిందన్నారు.

కావున జిల్లాలోని అర్హులైన దివ్యాంగులను గుర్తించి, వారికి అవసరమైన సహాయ పరికరాలను ఉచితంగా అందించేందుకు సంబంధిత శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు మరియు సహాయ పరికరాల పంపిణీ శిబిరాలను ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. దివ్యాంగులకు అవసరమైన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, బ్యాటరీతో నడిచే మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు, వాకింగ్ స్టిక్స్, క్రచెస్, వాకర్స్, కృత్రిమ కాళ్లు, చేతులు, కాలిపర్స్ మరియు ఇతర ఆర్థోపెడిక్ పరికరాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా బి.వి.హెచ్.పి.ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం. చుక్కయ్య. వికారాబాద్ పట్టణ అధ్యక్షులు ఆలయం గణేష్, వికారాబాద్ జిల్లా సలహాదారులు హనుమంతు, సురేష్, నారాయణ, జంగయ్య పాల్గొన్నారు.

# రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం - ఆర్డీవో అశోక్‌రెడ్డి



**చిట్యాల, యువ వెలుగు, సెప్టెంబర్ 29 :** భూముల రీసర్వేతో రైతుల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం పేరేపల్లి గ్రామంలో సర్పంచ్ రూపని సోనియా లింగస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్డీవో అశోక్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రీసర్వే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని పిట్టంపల్లి, పేరేపల్లి గ్రామాల్లో భూముల రీసర్వేకు గెజిట్ నోటిఫికేషన్ జారీ అయిందని తెలిపారు. పిట్టంపల్లిలో రీసర్వే ప్రక్రియ ఇప్పటికే పూర్తయిందని, పేరేపల్లిలో ప్రస్తుతం కొనసాగుతోందని చెప్పారు. గ్రామ పరిధిలోని 318 సర్వే నంబర్లలో ఉన్న భూములను సమగ్రంగా సర్వే చేయనున్నట్లు వెల్లడించారు. రీసర్వేలో తొలుత గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం, ప్రభుత్వ భూములను గుర్తించి, అనంతరం పట్టా భూములు, రహదారులను సర్వే చేస్తామని వివరించారు. సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద తప్పనిసరిగా హాజరై హద్దు రాళ్లను సర్వే బృందానికి చూపించాలని సూచించారు. భూముల హద్దులు స్పష్టంగా నమోదైతే భవిష్యత్‌లో భూ వివాదాలకు అవకాశం తగ్గుతుందని పేర్కొన్నారు.ప్రతి రైతు భూమికి భూధార్ ఎల్‌పీఎం నంబర్ కేటాయించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. రీసర్వే ప్రక్రియ సజావుగా పూర్తయ్యేందుకు గ్రామస్థులు, రైతులు అధికారులకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో చిట్యాల తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సర్వేయర్ రజనీకాంత్, జీపీఓ యాదయ్య, పంచాయతీ సిబ్బంది, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

